క్లుప్తంగా

మల్లన్న సన్నిధిలో తెలంగాణ గవర్నర్ సతీమణి



సుధాదేవ్‌వర్మకు స్వామి వారి చిత్రపటం అందిస్తున్న ఈఓ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను తెలంగాణ గవర్నర్ సతీమణి సుధాదేవ్‌వర్మ దర్శించుకున్నారు. సోమవారం ఆమెకు ఈఓ ఎం.శ్రీనివాసరావు, అర్చకులు, వేదపండితులు స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు వేదాశీర్వచనంతో ఆశీర్వదించారు. స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలు, స్వామి అమ్మవార్ల జ్ఞాపికను ఈఓ అందజేసి సత్కరించారు.

అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: పారుమంచాలలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టిని తవ్వుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు కర్ణ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం మాట్లాడుతూ గ్రామంలోని అలగనూరుకు వెళ్లే దారిలో గ్రామ పంచాయతీ అనుమతుల్లేకుండా ప్రొక్లెయినర్‌తో మట్టిని తవ్వి తరలిస్తున్నారని చెప్పారు. అనుమతుల్లేకుండా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వాడాలలో కబడ్డీ పోటీలు

పాములపాడు: నూతన సంవత్సరం పురస్కరించుకొని వాడాల గ్రామంలో జనవరి 2వ తేదీ నుంచి ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్‌సీఎం చర్చి సంఘం పెద్దలు సోమవారం తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.20 వేలు, రెండవ బహుమతి రూ.15 వేలు, మూడవ బహుమతి రూ.10 వేలు, నాల్గవ బహుమతి రూ.5 వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు వెల్లడించారు. కబడ్డీ పోటీల్లో పాల్గొనదలిచిన వారు రూ.300 ప్రవేశ రుసుము చెల్లించి జట్టు పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. క్రీడాకారులకు భోజన వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 96426 06454, 89780 36038 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

1 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

కొత్తపల్లి: నూతన సంవత్సరం సందర్భంగా 1, 2 తేదీల్లో మండలంలోని ఎర్రమఠం గ్రామంలో దాతల సహకారంతో సీఎస్ఐ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా, గ్రామీణస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎన్.చిన్న నాగేశ్వరరావు, నరసింహుడు, సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈ నెల 31వ తేదీ సాయంత్రంలోపు ఎంట్రీ ఫీజు రూ.300 చెల్లించి తమ జట్టు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు రూ.10,016, రెండో బహుమతి రూ.7,016, మూడవ బహుమతి రూ.5,016 అందించనున్నట్లు చెప్పారు. అలాగే గ్రామీణ క్రీడాకారులకు గ్రామస్థాయి పోటీలు నిర్వహించి విజేతలకు రూ.5,016, రెండవ బహుమతి రూ. 3,016, మూడవ బహుమతి రూ.2,016 బహుమతులు ఇవ్వనున్నట్లు తెలియజేశారు. పూర్తి వివరాలకు 98669 29360, 63027 09704 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

క్రీడా శిక్షణా శిబిరం పరిశీలన

పగిడ్యాల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రారంభించిన రాష్ట్రస్థాయి కబడ్డీ కోచింగ్ సెంటర్‌ను మండల జెడ్పీటీసీ సభ్యురాలు పుల్యాల దివ్య సోమవారం పరిశీలించారు. క్రీడాకారులతో మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమేనని అత్యుత్తమ ప్రదర్శనతో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తేవాలని సూచించారు. గోల్డ్ మెడల్స్ సాధించిన జాతీయ స్థాయి క్రీడాకారులు పి.రాగన్న, మోక్షేశ్వరరెడ్డి నుంచి మెలకువలు నేర్చుకోవాలన్నారు. క్రీడల్లో రాణించే వారికి విద్య, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు ఉంటాయన్నారు. ఎంఈఓ మురళీమోహన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రావు ఉన్నారు.

సంజీవరాయుడికి పూజలు

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన బరక సంజీవరాయస్వామికి సోమవారం అమావాస్య పురస్కరించుకొని అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, తదితర విశేష పూజలను ఆలయ పురోహితులు నరహరి శర్మ, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివార్లను పల్లకీలో ఆశీనులు చేసి భాజా భజంత్రీల మధ్య ఆలయ ప్రదక్షిణలు చేస్తూ పల్లకీ సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ పేరెడ్డి మురళీమోహన్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామికి పరోక్షసేవ

శ్రీశైలంటెంపుల్: అమావాస్యను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానంలోని క్షేత్ర పాలకుడు బయలు వీరభద్రస్వామివారికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. అలాగే 24 మంది భక్తులు పరోక్ష సేవ ద్వారా స్వామి వారికి పూజలను జరిపించుకున్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

పాములపాడు: మండలంలోని బీజేపీని పటిష్టపరిచేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఏఆర్‌ఓ చల్లా దామోదర్‌రెడ్డి సూచించారు. ఆయన సోమవారం బీజేపీ మండలాధ్యక్షుడిగా ఎన్నికైన మురళీ మోహన్‌ను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ఎదురులేని శక్తిగా ఎదిగిందన్నారు. ఆ పార్టీ నాయకులు హేమచంద్ర, నాగరాజు, రామక్రిష్ణుడు పాల్గొన్నారు.

మా బతుకులు ఇంతేనా?

- అభివృద్ధికి ఆమడ దూరంలో ఎరుకల కాలనీ
- సొంతింటి యోగానికి నోచుకోని ఎస్టీలు
- నేటికీ రేషన్, ఆధార్ కార్డులు లేవు
- సిమెంటు రోడ్లు, విద్యుత్ సౌకర్యం లేక అంధకారం
- ఇళ్ల కోసం నాయకులు, అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయిన ఎస్టీలు

జూపాడుబంగ్లా: ఎన్నేళ్లు గడిచినా ఇలాగే బతకాల్సిందేనా? మా బతుకులు మార్చేవారే లేరా? అంటూ జూపాడుబంగ్లాలోని ఎరుకలి వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులతో కాలనీల రూపురేఖలు మార్చుతామని ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొంటున్నా అదెక్కడా అమలు కావట్లేదని స్థానిక ఎస్సీ, ఎస్టీ కాలనీలవాసులు పేర్కొంటున్నారు. 43 ఏళ్ల క్రితం జూపాడుబంగ్లాలో 20 ఎరుకలి కుటుంబాల వారు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. వారికి ఎలాంటి స్థిర, చరాస్తులు లేకపోవటంతో సిక్కెంట్రుకల వ్యాపారం, పారకల తయారీ, పందుల పెంపకంతో జీవనం సాగిస్తున్నారు. తమకు పక్కా గృహాలు మంజూరు చేయాలని ఏళ్ల తరబడి ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోకపోవడంతో నేటికీ వారు పూరి గుడిసెల్లోనే తలదాచుకుంటున్నారు. వీరిలో కొంత మందికి ఆధార్ కార్డులు, రేషన్ కార్డు కూడా లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హత ఉన్నా వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయడం లేదంటే ఎస్టీల అభివృద్ధిపై గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి శ్రద్ధ ఉందో తెలుస్తోంది. ఏళ్లు గడిచినా పక్కా గృహాలు మంజూరు చేయకపోవటంతో ఛిద్రమైన పూరిగుడిసెల్లోనే నివాసం ఉంటూ వర్షం కురిస్తే తడుస్తూ పిల్లా పాపలతో జాగరణ చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకెందుకు ఇప్పటిదాకా పక్కాగృహాలు మంజూరు చేయడం లేదని ఎరుకలి వారు ప్రశ్నిస్తున్నారు.

ఒకే తాగునీటి కుళాయి



కాలనీలోని ఏకైక కుళాయి వద్ద నీటిని పట్టుకుంటున్న స్థానికులు

ఎరుకలి కాలనీలో కనీసం తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయకపోవటంతో వారు సొంత ఖర్చుతో 20 కుటుంబాలకు ఒక కుళాయిని ఏర్పాటు చేసుకున్నారు. ఆ కుళాయి నుంచి వచ్చే నీరే 20 కుటుంబాల వారికి శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎగువ కాలనీల వారు మోటార్లు వేస్తే తమకు తాగునీరు రావటం కష్టమవుతుందని పేర్కొంటున్నారు. కాలనీలో పైపులైన్ వేయించి కనీసం, రెండు, మూడు కుళాయిలు ఏర్పాటు చేస్తే తాగునీటికి ఇబ్బందులుండవని పేర్కొంటున్నారు.

అందని ఇళ్ల స్థలాలు, పక్కాగృహాలు

గ్రామం ఏర్పడకముందు వచ్చి గుడిసెలు వేసుకున్న స్థలాలు తప్పా ఇప్పటిదాకా ప్రభుత్వం తమకు ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు ఇవ్వలేదని ఎరుకలి వారు పేర్కొంటున్నారు. దీంతో ఒకే పూరిగుడిసెలో రెండు, మూడు జంటలు తలదాచుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమకు ఇళ్ల స్థలాలిచ్చి పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.



ఎరుకలివారు నివాసం ఉంటున్న గుడిసెలు



పాత చీరల పరదానే స్నానాల గది

విద్యుత్ సౌకర్యం, సిమెంటు రోడ్లు లేవు

జూపాడుబంగ్లాలోని ఎరుకలి కాలనీలో ఇప్పటికీ సిమెంటు రోడ్లు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయలేదంటే వీరు అడవిలో ఉన్నారా? లేక గ్రామాల్లో ఉన్నారా? అనే విషయం అధికారులు, ప్రజాప్రతినిధులే ఆలోచించాల్సి ఉంది. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రి వేళ చిమ్మచీకట్లో బిక్కుబిక్కుమంటు కాలం వెలదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిమ్మ చీకట్లో పాములు, తేళ్లు తిరుగుతున్నా అలాగే సంచరిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో ఓ బాలికకు పాముకాటు వేయటంతో మృత్యువాత పడినట్లు వాపోయారు. సిమెంటు రోడ్లు లేకపోవటంతో చిన్నపాటి వర్షం కురిసినా అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితిలో ఉంటుందని పేర్కొంటున్నారు.

కాళ్లరిగేలా తిరిగినా ఇల్లు ఇవ్వలేదు



తమకు ఇల్లు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పక్కా గృహం మంజూరు చేయలేదు. టార్పాలిన్ పట్టలతో ఏర్పాటు చేసుకున్న గుడిసెల్లోనే భార్యా, పిల్లలతో తలదాచుకుంటున్నాం. గుడిసెలు ఛిద్రం కావటంతో వర్షం వస్తే పిల్లాపాపలతో జాగరణ చేయాల్సి వస్తోంది.

– చిన్నసుబ్బన్న, ఎరుకలి కాలనీ

గుడిసెలో నిల్చోవడం కూడా కష్టమే



పక్కాగృహాలు మంజూరు చేయకపోవటంతో పూరి గుడిసెల్లోనే ఏళ్ల తరబడి నివసిస్తున్నాం. ఇంట్లో నిల్చోవాలంటే కూడా ఇబ్బందే. గుడిసెలో కేవలం రాత్రివేళల్లో నిద్రించటానికి మాత్రమే ఉపయోగపడ్తున్నాయి. పగలంతా గుడిసె బయటే కాలం వెలదీస్తున్నాం. రాత్రివేళల్లో మాత్రమే గుడిసెల్లో తలదాచుకుంటున్నాం. పక్కాగృహాలు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదు.

– సుబ్బన్న, ఎరుకలికాలనీ

ఆధార్, రేషన్ కార్డులు లేవు



నాకు, నా భార్యకు ఇప్పటిదాకా రేషన్ కార్డు, ఆధార్ కార్డుల్లేవు. రేషన్ కార్డు కోసం సార్లొళ్ల వద్దకు వెళితే ఆధార్ కార్డు కావాలంటున్నారు. ఆధార్ కార్డు కోసం వెళ్తే రేషన్ కార్డు కావాలంటున్నారు. ఏం చేయాలో తోచక గమ్మునుండిపోయాను. రేషన్‌కార్డు లేనందుకు బియ్యం కూడా ఇవ్వడం లేదు. ఎలాంటి ప్రభుత్వ పథకాలు ఇవ్వడం లేదు.

– గంగన్న, ఎరుకలి కాలనీ

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగారురావు

నందికొట్కూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని సీపీఎం ఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బంగారురావు అన్నారు. స్థానిక రాయల్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముందుగా అమర వీరులకు నివాళులర్పించారు. పార్టీ నియోజకవర్గ కమిటీ సభ్యులుగా వెంకటేశ్వర్లు, వెంకటరమణ, బీబి, షేక్షావలి, ఏసన్న, రామకృష్ణ, నాగార్జున తదితరులను ఏకగ్రీవ తీర్మానంతో రాష్ట్ర కార్యదర్శి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. కేంద్రంలోని ఎన్డీఏ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు చేస్తున్న మత రాజకీయాలను ఎండగడుతూ ప్రజల పక్షాన ఉద్యమాలు చేస్తామన్నా రు. జమిలీ ఎన్నికల బిల్లును వామపక్ష పార్టీలు వ్యతిరేకించినా ఎన్డీఏ పార్టీలు ఆమోదించడం దుర్మార్గమన్నారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు అంబేడ్కర్ రాజ్యాంగం గురించి చెబుతుంటే జీర్ణించుకోలేని హోంమంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. వచ్చే నెల 20న కర్నూలు పట్టణంలో రాజ్యాంగంపై సదస్సు జరుపుతునట్లు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసగించారని మండిపడ్డారు. వాల్మీకి సంఘం నాయకులు గౌరీశ్వర నాయుడు, ఆ పార్టీ నాయకులు సత్తారు, రమణయ్య, నాగరాజు, వేమన, మల్లేశ్వరమ్మ, మస్తాన్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటరీ సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని వామపక్ష నాయకులు నాగేశ్వరరావు, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. పూల మాలలు వేసి నివాళులర్పించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. అమిత్ షా డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. వామపక్షాల నాయకులు గోపాలకృష్ణ, బాబు, రజిత, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ను అవమానపరిచేలా మాట్లాడిన కేంద్ర మంత్రి అమి త్‌షాపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్య దర్శి ఎస్.స్వాములు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె.దినేష్‌లు డిమాండ్ చేశారు.సోమవారం సీపీఐ ఆధ్వ ర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం పట్ల, రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల గౌరవం లేని అమిత్‌షా పార్లమెంటులో ఉండకూడదని డిమాండ్ చేశారు.

పగిడ్యాల: అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఎం నాయకులు ఈశ్వరమ్మ, ఉసేనమ్మ, మద్దిలేటి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆత్మకూరు: అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్రమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.యేసురత్నం, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, మండల కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్టీసీ బస్టాండ్ ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ పేరును స్మరించే బదులు దేవుని పేరు ఏడుసార్లు స్మరిస్తే స్వర్గానికి వెళ్లి రావొచ్చని అమిత్‌షా వ్యాఖ్యానించడం చూస్తే రాజ్యాంగ నిర్మాత పట్ల అమిత్‌షాకు, బీజేపీకి ఉండే వైఖరి స్పష్టమవుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎ.సురేంద్ర, డి.రామ్‌నాయక్, వీరన్న, భాస్కర్, బీఎస్ వలి, శివకుమార్, కిరణ్, సుబ్బయ్య, మాబాషా, స్వాములు, దినేష్, వలీ, షఫీ పాల్గొన్నారు.

ఇస్తెమాకు సహకరిద్దాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్

ఆత్మకూరు: పట్టణంలో జనవరి 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఇస్తెమాకు సహాయ సహకారాలు అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మున్సిపల్ కౌన్సిలర్ల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ముస్లింల ప్రార్థనా కార్యక్రమం ఇస్తెమాకు మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు సహకరించాలన్నారు. పారిశుద్ధ్య పనులు, మౌలిక సదుపాయాలు, సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.22 లక్షలు మంజూరు చేశామన్నారు. బస్టాండు వద్ద మౌలిక వసతుల రూపకల్పనలో భాగంగా రూ.99 వేలు ఖర్చు చేసి ఐ లవ్ ఆత్మకూరు పేరును ఎల్ఈడీ లైట్లతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొండాగార్డెన్ ఫంక్షన్‌హాల్ సమీపంలో మున్సిపల్ స్థలం ఉందని, ఆ స్థలంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసేందుకు రూ.99 వేలు ఖర్చు చేయనున్నామని తెలిపారు. ఇందిరానగర్, అర్బన్ కాలనీ, గ్రామ కంఠం స్థల విక్రయాల అగ్రిమెంట్ల ద్వారా గృహ నిర్మాణాలకు ఒక శాతం రుసుం వసూలు చేయనున్నట్లు తెలిపారు. తాత్కాలిక పద్ధతిలో నియమిస్తున్న ఐదుగురు స్వీపర్లకు నెలకు రూ.21 వేల చొప్పున, డ్రైవర్లకు రూ.24,500 చొప్పున వేతనం చెల్లించనున్నామన్నారు. సమావేశంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రషీద్, కమిషనర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులే మేలు



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న అధికారులు

వెలుగోడు: వ్యవసాయంలో రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువులే మేలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, ఏఓ పవన్ కుమార్ సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఆహార ఉత్పత్తులను ఏఓ, ఎంపీడీఓ పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ హౌసింగ్ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కోమల పాల్గొన్నారు.

ఘనంగా మహానందీశుడి పల్లకీసేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామికి సోమవారం రాత్రి ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, ఆంజనేయ శర్మ, అర్చకులు పల్లకీసేవను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ మహానంది శ్రీనివాసులు పాల్గొన్నారు. అమావాస్యతో కూడిన సోమవారం కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అలాగే మహానందీశ్వరుడి దంపతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

విత్తనశుద్ధి పాటించాలి

ఆత్మకూరు: మినుములో విత్తన శుద్ధి పాటించాలని మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. కురుకుంద–2 (కొట్టాల చెరువు) గ్రామంలో సోమవారం మినుము పంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు.

లేబర్ ఇన్సూరెన్స్ చేయించుకోండి

జూపాడుబంగ్లా: తెల్ల రేషన్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరూ లేబర్ ఇన్సూరెన్స్ చేయించుకొని ప్రయోజనం పొందాలని ఏపీఎం అంబమ్మ సూచించారు. సోమవారం జూపాడుబంగ్లా వెలుగు కార్యాలయంలో లేబర్ ఇన్సూరెన్స్‌పై పొదుపు మహిళలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. లేబర్ ఇన్సూరెన్స్‌కు ప్రభుత్వ ఉద్యోగులు మినహా అందరూ అర్హులేనన్నారు. ఏడాదికి రూ.22 చొప్పున ఐదేళ్లకు రూ.110 చెల్లిస్తే సరిపోతుందన్నారు. 18 ఏళ్ల నుంచి 55 ఏళ్ల వయసున్న స్త్రీ, పురుషులు అర్హులని, ఇన్సూరెన్స్ కోసం రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్సులతో పాటు బ్యాంకు ఖాతా చలానా జతచేసి లేబర్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ పాలసీ కలిగిన వారు సహజ మరణం పొందితే రూ.1,30,000, ప్రమాదవశాత్తు చనిపోతే రూ.6 లక్షల ఇన్సూరెన్స్ వర్తిస్తుందని, ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలు ఉంటే వారి వివాహ నజరానాగా రూ.30 వేలు, రెండు ప్రసవాలకు రూ.30 వేలు చొప్పున అందజేస్తారని తెలిపారు. పాలసీ పొందిన ఏడాది అనంతరం లబ్ధిదారునికి ప్రమాదం జరిగి 50 శాతం వైకల్యం సంభవిస్తే రూ.2.50 లక్షలు, వంద శాతం వైకల్యం ఏర్పడితే రూ.5 లక్షల వరకు పరిహారం వర్తిస్తుందన్నారు. ఏపీఎం అంబమ్మ, వెలుగు సీసీలు, ఎల్‌సీ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరంలో అమావాస్య పూజలు



శివలింగానికి కృష్ణాజలాలతో అభిషేకం చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: పవిత్ర పుణ్యక్షేత్రం, సప్తనది సంగమం, సంగమేశ్వరం ఎగువ పుష్కర ఘాట్ వద్ద ఉమామహేశ్వరాలయంలో సోమవారం ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామ శర్మ సోమవతి అమావాస్య పూజలు జరిపారు.లలితాదేవి అమ్మవారిని పట్టువస్త్రాలతో, పూలమాలలతో అలంకరించారు. అదేవిధంగా శివలింగాన్ని పూలమాలలతో అలంకించారు. అనంతరం కృష్ణాజలాలతో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చ న, మంగళహారతీవంటి పూజాక్రతువులు నిర్వహించారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

వెలుగోడు: చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ సూచించారు. సోమవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. విజేతలకు మొదటి బహుమతి రూ.8 వేలు, రెండో బహుమతి రూ.6వేలు, మూడో బహుమతి రూ.4 వేలు, నాలుగో బహుమతి రూ.2 వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజి నాయక్

ఆత్మకూరురూరల్: నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ప్రసాదరావు హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎలాంటి ప్రమాదాలకు చోటు ఇవ్వకుండా ఆనందంగా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురికావద్దని యువతకు సూచించారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు.

పాములపాడు: నూతన సంవత్సరం వేడుకలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ సురేష్ బాబు సూచించారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని, నిబంధనలు పాటిస్తూ ఇతరులకు ఇబ్బంది కలుగకుండా వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

జూపాడుబంగ్లా: న్యూ ఇయర్ సందర్భంగా డిసెంబర్ 31న రాత్రి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ లక్ష్మినారాయణ హెచ్చరించారు. ఆయన సోమవారం మాట్లాడుతూ.. అనుమతుల్లేకుండా స్పీకర్లు పెట్టి డ్యాన్సులు చేయడం, బాణసంచా కాల్చడం, ఈలలు, కేకలు వేస్తూ అల్లర్లకు పాల్పడటం, సైలెన్సర్ తీసేసి పెద్ద శబ్దంతో బైక్‌లు నడపటం వంటివి చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. మద్యం దుకాణాలను నిర్ణీత సమయంలోగా మూసివేయాలన్నారు. రాత్రి పది గంటల నుంచి విస్తృతంగా వాహనాల తనిఖీ చేపడతామని స్పష్టం చేశారు.

మిడుతూరు: మండలంలోని ప్రజలు నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ ఓబులేసు సూచించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ రోడ్లపై కేక్‌లు కటింగ్, డీజే, రికార్డింగ్ డాన్స్‌లు తదితర వాటికి అనుమతులు లేవన్నారు. 31న రాత్రి వాహన తనిఖీలు చేపట్టి నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

పాములపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టారీతిన పాలన సాగిస్తూ, ప్రజా సంక్షేమాన్ని విస్మరించాయని సీపీఎం సీనియర్ నాయకుడు రామేశ్వరరావు విమర్శించారు. సోమవారం స్థానిక బస్టాండ్ సెంటరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. పేదల నడ్డి విరిచి, పెద్దలకు ఆదాయం చేకూర్చేలా ప్రభుత్వ తీరు ఉందని విమర్శించారు. పార్లమెంటు సాక్షిగా కేంద్ర మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురించి అవమానకరంగా మాట్లాడటం పట్ల దేశ వ్యాప్తంగా ప్రజలు ఛీదరించుకుంటున్నారని చెప్పారు. ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందిన అంబేడ్కర్ గురించి తప్పుగా మాట్లాడిన వ్యక్తిని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయకుండా బీజేపీ వినోదం చూస్తుందని ఎద్దేవా చేశారు. సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న, రమణ, బాలయ్య, మాల మహనాడు అంకన్న పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ఆత్మకూరు: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలల వసతిగృహంలో సోమవారం ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.దినేష్‌కుమార్, పట్టణ కార్యదర్శి సాయి మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఆవిర్భావం నుంచి నేటి వరకు విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. అనంతరం ఎస్సార్‌బీసీ కాలనీలోని ఆశ్రమంలో అనాథలకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు రామ్‌నాయక్, బాలాజీ, దిలీప్‌బాబు, వంశీ, రవి, సాలయ్య పాల్గొన్నారు.

ఒకే ఈతలో రెండు దూడలు

నందికొట్కూరు: మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో హనుమంత రెడ్డి అనే రైతుకు చెందిన గేదె రెండో ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. సోమవారం గేదె ఈనేందుకు తీవ్ర ఇబ్బంది పడుతుండగా రైతు పశు వైద్యాధికారి సాయినాథరెడ్డికి సమాచారం అందించారు. అనిమల్ హజ్బెండరీ అసిస్టెంట్ నరేష్ పరీక్షించి గేదె గర్భంలో రెండు దూడలు ఉన్నట్లు గుర్తించి డాక్టర్‌కు వివరించారు. డాక్టర్ సూచనలతో రెండు దూడలను క్షేమంగా బయటకు తీశారు. గేదె ఒకే ఈతలో రెండు దూడలు ఈనడం అరుదుగా జరుగుతుందని వైద్యాధికారులు తెలిపారు.

అర్జీపై నిర్లక్ష్య సమాధానం

నందికొట్కూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఇచ్చిన అర్జీని పరిష్కరించకుండా నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం ఎంతవరకు సమంజసమని బాధితురాలు వెంకటరమణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ.. పట్టణ పొలిమేరలోని సర్వే నంబరు 90లో 5.12 ఎకరాల భూమి తన తండ్రి పేరిట ఉండేదన్నారు. అయితే తన సంతకం లేకుండా ఆ భూమిని కుమారుల పేరిట ఎలా మార్పు చేస్తారని ప్రశ్నించారు. తండ్రి ఆస్తిలో ఐదుగురు కుమారులతో పాటు తనకు సమాన వాటా ఇచ్చాడని చెప్పారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగిన తప్పుపై అర్జీ ఇస్తే తహసీల్దార్ స్పందించకుండా కోర్టుకు వెళ్లమని చెప్పడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీశైలం, నందికొట్కూరు
70750 09158
Office mail : sakshiknladvt@gmail.com